بسم اللہ الرحمٰن الرحیم    نحمدہ و نصلی علیٰ رسولہ الکریم    و علیٰ عبدہ المسیح الموعود

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 14.09.2018 (Telugu)**

## జమాఅత్ సభ్యులు అల్లాహ్ తఆలా ఆదేశములను అర్థము చేసుకొనుట, నమ్ముట, ఆచరించుటలో గతము కంటే ముందడుగు వేయుటకు అల్లాహ్ తఆలా ఈ శుభములు కారణము కావలెను
## పుణ్యము, నిష్టాపరత, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అవతరణ ఉద్ధేశమును పూర్తి చేయుటలో ప్రగతి చెందుట, ముందడుగు వేయుటలో మన ప్రతి దినము, ప్రతి అడుగు గతము కంటే ముందుండవలెను
## మనము మన పాపములను వీడి, పుణ్యములలో నూతన లక్ష్యాలను చేధించుచుండవలెను

*హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 14.09.2018 తేదీన - (బెల్జియం సభాప్రాంగణము), బ్రెసెల్స్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి. అల్లాహ్ తఆలా కృపానుసారము నేటి నుండి అహ్మదియ్య జమాఅత్ బెల్జియం వార్షిక సభ ప్రారంభమగుచున్నది. చాలా కాలము తరువాత నేను మీ సభలో పాల్గొంటున్నాను. ఈ కాలములో జమాఅత్ పెరగినది. ఇంతేగాక ఇంకా అనేక విషయములలో ఇక్కడ అభివృద్ధి జరిగినది. ఉదా॥ ప్రచార కేంద్రముల సంఖ్య పెరిగినది. నమాజ్ కేంద్రములు అధికమైనవి. బ్రెసిల్స్ మస్జిద్ ఇంకా నిర్మాణములో యున్నను దాదాపు ముగింపు దశకు చేరినది. చాలా మంచి మస్జిద్ నిర్మితమగుచున్నది. మొన్న హాల్కన్‌లో నేనొక మస్జిద్‌ను ప్రారంభించినాను. సువిశాలమైన స్థలముతో పాటు ఒక భవనమును అల్లాహ్ తఆలా జమాఅత్‌నకు అందించెను. బాహ్య రూపంలో ఇక్కడ జమాఅత్‌నకు చాలా శుభములు కలిగినవి. జమాఅత్ సభ్యులు అల్లాహ్ తఆలా ఆదేశములను అర్థము చేసుకొనుట, నమ్ముట, ఆచరించుటలో గతము కంటే ముందడుగు వేయుటకు ఆచరణాత్మకంగా అల్లాహ్ తఆలా ఈ శుభములు కారణము కావలెను. పుణ్యము, నిష్టాపరత, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అవతరణ ఉద్ధేశమును పూర్తి చేయుటలో ప్రగతి చెందుట, ముందడుగు వేయుటలో మన ప్రతి దినము, ప్రతి అడుగు గతము కంటే ముందుండవలెను. మనము మన పాపములను వీడి, పుణ్యములలో నూతన లక్ష్యాలను చేధించుచుండవలెను ఈ విషయము జమాఅత్ సభ్యులలో కనిపించినప్పుడు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం అవతరణ ఉద్ధేశమును మనము పొందినాము లేదా పొందుటకు ప్రయత్నించుచున్నామని, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బైఅత్ హక్కును చెల్లించుటకు ప్రయత్నించుచున్నామని మనము అనవచ్చును.

మిరిక్కడికి మతము పేరున వచ్చినారు, అల్లాహ్ తఆలా నామమున వచ్చినారను విషయమును మీరు గర్తుంచుకోగలరు. కనుక అల్లాహ్ ఆదేశములను ఆచరించనిచో ఈ విషయములు అల్లాహ్ తఆలా అసంతృప్తికి కారణము కావచ్చును. పరిమితంగా ప్రపంచము వైపు దృష్టి పెట్టుట, ధనము సంపాదించుట పాపము కాదు. కాని ధనముపై ప్రాపంచికుల వలె పడిపోవుటను అల్లాహ్ తఆలా నిషేధించెను. ఈ విషయమును తెలుపుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి. అల్లాహ్ తఆలా ప్రపంచ పనులను ధర్మబద్ధంగా చేసెను. ఎందుకనగా ధనము లేని కారణమున కూడ ఆపదలు సంభవించును. ఈ ఆపదల వల్లనే మానవుడు దొంగ, దోపిడీదారునిగా మారుతాడు. అనేక దురలవాట్లకు పాల్పడుతాడు. కాని ప్రతి విషయానికి ఒక హద్దుంటుంది. ధార్మిక విషయములలో మీకు సహాయడపే విధంగా ప్రాపంచిక పనులను అవలంభించగలరు. కాని అసలు ఉద్ధేశము ధర్మమై వుండవలెను.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ధనము సంపాదించినను అల్లాహ్ తఆలా ఆదేశము మేరకు భార్యా పిల్లల హక్కులు చెల్లించవలెను. అల్లాహ్ తఆలా ప్రాణుల హక్కులు చెల్లించవలెను. అల్లాహ్ ధర్మమునకు సేవలందించవలెను.

ఈ ఉద్దేశమున్నచో ప్రపంచము కూడ లభించును, ధర్మము కూడ లబించును. హుజూరె అన్వర్ ఇట్లనిరి. ప్రపంచమును పొందుటకు అసలు ఉద్దేశము ధర్మము కావలెనని తెలుపుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. ఇస్లాం సన్యాసత్వమును నిషేధించినది. విశ్వాసుని సంబంధములు ప్రపంచముతో ఎంత అధికముగా యుండునో అవి అంత గొప్ప స్థాయికి చేర్చుటకు కారణమగును. ఎందుకనగా అతని లక్ష్యము ధర్మమే అగును. ప్రపంచము, అతని ధనము, అతని వైభవము ధర్మమునకు లోబడి యుండును. దీని భావమేమనగా ధనము ఒక వాహనము. దానిపై మానవుడు కూర్చొని ధర్మపు గొప్ప లక్ష్యములను అధిరోహించును. అల్లాహ్ తఆలా ఇట్లు బోధించెను. رَبَّنَآ اٰتِنَا فِی الدُّنۡیَا حَسَنَۃً وَّفِی الۡاٰخِرَۃِ حَسَنَۃً ఇందులో కూడ ప్రపంచమునే మొదట ప్రస్తావించెను. కాని పరలోకములో మంచికి కారణమగు మంచి ప్రపంచమును మొదట ప్రస్తావించెను. కనుక ప్రపంచమును సంపాదించుటలో విశ్వాసుల అసలు ఉద్దేశము పరలోక పుణ్యములే లక్ష్యమై వుండవలెనని ఈ దుఆ బోధనతో స్పష్టముగా అర్థమగుచున్నది. حسنة الدنیا (మంచి ప్రపంచము) అని సూచించి ఒక విశ్వాసి, ముస్లిం ప్రపంచమును పొందుటకు అవలంభించవలసిన ఉత్తమోత్తమ మార్గములను ప్రస్తావించెను. حسنات (మంచి) పుణ్యమునకు కారణమగు ప్రతి పద్ధతితో ప్రపంచమును పొందుటకు ప్రయత్నించుము. ఇతర మానవులకు బాధ కలిగించే లేదా తోటి మనుషులలో అవమానము, లజ్జకు గురి చేయు పద్ధతి కాకూడదు. అప్పుడే మంచి పరలోకమునకు కారణమగును. హుజూరె అన్వర్ ఇట్లనిరి. పరలోకములో పుణ్యములకు కారణమయ్యే ప్రపంచమును సంపాదించుటకు మనలోని ప్రతి ఒక్కరు కృషి చేయవలెను.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి. బాహ్య ఆస్తిపాస్తులు లేదా అధికారము, ధనము, గౌరవము, అధిక సంతానము మానవునికి సుఖము లేదా మనశ్శాంతి, విశ్రాంతి కలిగించునని, అతడు అనుక్షణం స్వర్గములో వుంటాడని భావించకుము. స్వర్గ వరములైన మనశ్శాంతి, సంతృప్తి, సుఖము ఈ విషయములతో లభించనే లభించదు. అల్లాహ్‌లోనే లీనమైనప్పుడు అది లభించును. ఇందుకు ప్రవక్తలు ప్రత్యేకంగా ఇబ్రాహీమ్, యాకూబ్ అలైహిస్సలాం ఉపదేశము فَلَا تَمُوۡتُنَّ اِلَّا وَاَنۡتُمۡ مُّسۡلِمُوۡنَ అనగా అల్లాహ్ తఆలాకు సంపూర్ణ విధేయుగా మారనంత వరకు మీరు మరణించకూడదని వుండెను. అనగా మీరు ప్రతి క్షణం అల్లాహ్ తఆలా విధేయత వహించవలెను. వారు అలైహిస్సలాం ఇట్లనిరి. ప్రపంచ అభిరుచి ఒక రకమైన అపవిత్ర ఈర్ష్య కలిగించి ఆశ, దాహమును పెంచును. కనుక ఈ అనవసర అత్యాశ, కోరికల అగ్ని కూడ నరకములోని అగ్నికి చెందినదే. అది మానవునికి మనశ్శాంతి, నిలకడ లేకుండా చేయును. అయోమయము, బాధ, వ్యాకులతకు గురగునట్లు చేయును. కనుక మానవుడు ధనము, ఆస్తి పాస్తులు లేదా భార్యా పిల్లల ప్రేమలో ఉద్రేకము, మత్తులో పిచ్చివాడై అతని అతని దేవుని మధ్య తెర ఏర్పాటు కాకూడదని నా మిత్రులు గమనించవలెను. వారింకా ఇట్లనిరి. ధనము, సంతానము అల్లాహ్ తఆలా దాసుని మధ్య ఆటంకము ఏర్పాటు చేయును. అందుకే వారిని మోసము అని అనబడెను. ధనము, సంతానము వలన కూడ మానవునికి నరక శిక్ష పడును. వారి నుండి అతన్ని విడదీసినచో అతడు అతి వ్యాకులత, ఆందోళనకు గురగును. వారిట్లనిరి. రెండు వస్తువులు పరస్పరం తాకినప్పుడు ఒక వేడి పుట్టును. ఇదే విధముగా మానవుని ప్రేమ, ప్రాపంచిక ప్రేమ తాకినప్పుడు ఏర్పడే వేడి వలన అల్లాహ్ తఆలా ప్రేమ దహనమైపోవును. హృదయము చీకటిమయమై అల్లాహ్ తఆలాతో దూరమగుదురు. ప్రతి వృధా పని చేయుదరు. కాని ప్రాపంచిక వస్తువులతో సంబంధము అల్లాహ్ కొరకు ఏర్పడినప్పుడు ఆ రాపిడి వలన దైవేతరుల ప్రేమ దహనమైపోవును. దాని చోట ఒక కాంతి, జ్యోతి నిండిపోవును. అప్పుడు అల్లాహ్ తఆలా ఆశించినదే మానవుడు కోరును.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. మనము అల్లాహ్ తఆలాకు సమీపమున చేరాలని, ధర్మమునకు ప్రపంచముపై ప్రాధాన్యతనివ్వాలని, ప్రపంచములో నివసించుచు ప్రపంచమును ధర్మమునకు సేవకురాలిగా చేయాలని సభలో పాల్గొను ప్రతి ఒక్కరు సదా లక్ష్యముగా చేసుకోవలెను. అల్లాహ్ తఆలా మనతో ఆశించున్నదేమిటి? మానవ జీవిత

ఉద్దేశమేమిటి? అనే ఈ స్ఫూర్తిని కేవలం తమలో కలిగించుకోవడమే కాక తమ సంతానములో కూడ కలిగించవలెను. హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనిరి. నా హస్తమున బైఅత్ చేసి ఈ సంస్థలో చేరిన విధేయులందరు ప్రాపంచిక ప్రేమ తగ్గుట, తమ పోషకుడు అల్లాహ్ తఆలా, మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రేమ హృదయములను జయించి పరలోక ప్రయాణము అయిష్టముగా మారకుండా అగుటయే బైఅత్ ఉద్దేశమని తెలుసుకోగలరు. అల్లాహ్ తఆలా అతని ప్రవక్తతో సంపూర్ణ ప్రేమ ఏర్పడనంత వరకు ప్రపంచ ప్రేమలో తగ్గుదల ఏర్పడదు, మరణించే సమయమున మానవునికి మనశ్శాంతి కలుగదు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. సభల పరంపర మొదలైనప్పుడు ప్రజలు సభ ఉద్దేశాలను నెరవేర్చడం లేదని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఒక సభ సందర్భమున తెలిసినప్పుడు చాలా అసంతృప్తిని వ్యక్తపరచి, ఈ సంవత్సరం సభను నిర్వహించనని తెలిపిరి. ఆ సంవత్సరం సభ జరగలేదు.

ఇటువంటి వ్యక్తులు తమ బలహీనతల వలన హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం జీవితములో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం అసంతృప్తికి కారకులైనప్పుడు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం అసంతృప్తికి కారకులైన వారి కోవకు చెందిన వారు సంఖ్యాపరంగా నేడు ఎందరున్నారో అల్లాహ్ తఆలాకే తెలుసు. ఈ కోణములో ప్రతి ఒక్కరు తమ ఆత్మ పరిశీలన చేసుకోవలసిన అవసరమున్నది. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఆశించిన ప్రమాణము లేనిచో సభలో పాల్గొనుటకు మనము అర్హులము కాదు. ఈ విషయము వలన ప్రతి విధేయుడైన అహ్మదీ హృదయములో కలత ఏర్పడవలెను. నేడు ప్రతి సంవత్సరం ప్రపంచములోని వివిధ దేశములలో సభలు జరుగుచున్నవి. కొన్నిటిలో నేను పాల్గొంటాను, కొన్నిటిలో ఎమ్.టి.ఏ.మాధ్యమముతో పాల్గొంటాను. మీలోని కొందరు యూరప్‌లోని అన్ని సభలలో పాల్గొంటారు. అనేక సభలలో పాల్గొంటున్న కొందరు ఇప్పుడు కూడ నా ముందు కూర్చున్నారు. కనుక ఒకే సంవత్సరంలో ఒకటి కంటే ఎక్కువ సభలలో పాల్గొన్నందుకు మన జీవితములో ఒక విప్లవము ఏర్పడవలెను. పరలోక ప్రయాణము అయిష్టముగా మారకుండా వుండుటకు సంవత్సరానికి ఒక సారి సభలో పాల్గొనాలని ఒకప్పుడు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం పిలుపునిచ్చేవారు. కాని నేడు కొందరు వ్యక్తులు ఒకే సంవత్సరం ఒకటి కంటే ఎక్కువ సభలలో పాల్గొంటారు. ఇటువంటి స్థితులలో ఎంత గొప్ప విప్లవము ఏర్పాడాలో మీరే ఆలోచించండి. నిస్సందేహంగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంతో జరిగే ఒక్క భేటియే అనేక సభల కంటే అధిక శుభము కలిగి యుండెడిది. వారితో భేటి అయిన తరువాత ఒక విప్లవము ఏర్పడేది. కాని నేడు వరుసగా అనేక సభలను చూచుట, పాల్గొనడం వలన కొంతైనా పవిత్ర మార్పు ఏర్పడవలెను.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఎమ్.టి.ఏ. వినాలని కూడ నేను సూచించుచున్నాను. పాకిస్తాన్‌లో సభలపై నిషేధం గలదు. అక్కడి ప్రజలు ఈ కోణములో నిస్సహాయులుగా యున్నారు. కనుక ఎమ్.టి.ఏ. ద్వారా కనీసం క్రమం తప్పకుండా ఖుత్బాలను వినండి. వాటిని ఆచరించుటకు ప్రయత్నించడి. సభా కార్యక్రమాలను ఎమ్.టి.ఏ. ద్వారా తిలకించి, విని, వాటితో లబ్ది పొందుటకు ప్రయత్నించడి. తద్వారా 60, 70 శాతం దాహము తీరును. తలచుకున్నచో 100 శాతం పవిత్ర మార్పు ఏర్పడవచ్చును. ఇప్పుడు యూరప్‌నకు చేరిన మీతో నేను చెప్పదలచినదేమనగా మీరు సభలలో పాల్గొంటున్నారు. కొందరు ఒకే సంవత్సరం ఒకటి కంటే ఎక్కువ సభలలో పాల్గొంటున్నారు. నేను చెప్పినట్లు ఇక్కడికి వచ్చిన వారు తమ జీవితములో ఒక విప్లవము కలిగించుకోవలెను. అల్లాహ్ తఆలా అందించిన ఈ శిక్షణ శిబిరం హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఆశయముల మేరకు ప్రపంచమును తమ సేవకురాలిగా చేసుకొని ఒక పవిత్ర మార్పు కలిగించుకొన్నప్పుడే ఇందులో పాల్గొనుట లాభదాయకమగును. ఇక్కడికి వచ్చినందున సభా కార్యక్రమాలను శ్రద్ధగా వినండి. తమలో పవిత్ర మార్పు ఏర్పాటు

చేసుకొను ఉద్ధేశముతో ఇక్కడి విషయములను శ్రద్ధగా వినండి.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. నేటి ముస్లిముల అవమాన, క్షీణత స్థితికి గల కారణమేమనగా మహా గొప్ప ఉపన్యాసకుల ప్రసంగములను వింటారు కాని ఆచరించరు. ఆచరణ దాదాపు శూన్యమే కాదు అసలు లేనే లేదు. ఆచరించని జాతి ఎన్నటికి అభివృద్ధి చెందదు. మాటలు తప్ప ఆచరణ లేదని నేటి ముస్లిముల స్థితి స్పష్టముగా నిరూపించుచున్నది. ఆచరణ యున్నచో నేడీ స్థితి ఏర్పడేది కాదు. ముస్లిములలో ఏర్పడిన బలహీనతలను దూరము చేసుకోవాలనే ఉద్ధేశముతో మనము హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంను విశ్వసించినాము. లేనిచో ఎలాంటి ప్రయోజనము లేదు. కనుక ఇక్కడికి వచ్చే అసలు ఉద్ధేశమును దృష్టియందుంచుకోగలరు. ఈ ఉద్ధేశమును పొందుటకు అల్లాహ్ తఆలా ప్రతి ఒక్కరిని అనుగ్రహించుగాక!

నిర్వహనపరంగా సభ గురించి కొన్ని విషయములు తెలుపదలచితిని. అన్నిటికంటే మొదటి విషయమేమనగా సభ కొరకు తీసుకున్న ఈ పరిసరాలను దృష్టిలో వుంచుకోగలరు. యాజమాన్యమునకు ఎలాంటి ఇబ్బంది కలుగకూడదు. బయటికి వెళ్ళేటప్పుడు పొరుగువారికి ఇబ్బంది ఏర్పడ కూడదు. ఇందులో ఎలాంటి నిర్లక్ష్యము తగదు. అప్పుడే ముస్లిమేతరులకు నిజమైన ఇస్లాం తెలియును. అహ్మదీయులు పొరుగువారి హక్కులు చెల్లించువారని, చట్టమును పాటించేవారని, ఇంత అధిక సంఖ్యలో వచ్చినను ఎలాంటి ఇబ్బంది కలిగించలేదని తెలియును. సభ అసలు ఉద్ధేశమైన దుఆను కూడ దృష్టియందుంచుకోగలరు. దురూద్ చదవండి. దైవస్మరణలో సమయము గడపండి. ఇంతుకు ముందు కూడ నేను చెప్పినట్లు సభా ప్రసంగములను శ్రద్ధగా వినండి. ఇందుకు తగు ఏర్పాట్లు చేసుకోగలరు. సభ జరుగుచున్నంత వరకు ప్రతి కార్యక్రమములో పాల్గొనండి. ఉపన్యాసములను వినండి. తద్వారా మీరు మీ పిల్లలను తీర్చిదిద్దవచ్చును, రాబోవు భావి తరాలను సంస్కరించవచ్చును. సభ ప్రాముఖ్యత ఏమిటో వారికి అర్థమయ్యేలా చేయగలరు. సభలలో పరస్పరం కూడ కొన్ని అవాంఛిత సంఘటనలు చోటుచేసుకుంటాయి. పాత తగాదాలు కొనసాగుచున్నప్పుడు ఒకే చోట కలిసినచో అవి గుర్తుకు వచ్చును. కనుక ఈ ప్రాంగణములో పూర్తి శాంతిని పాటించండి. పరస్పరం బాధ కలిగించే విధంగా వ్యవహరించకండి. దీని వలన ప్రజలపై కూడ తప్పుడు ప్రభావము పడును. అల్లాహ్ తఆలా అన్ని విధాలా సభను జయప్రదం చేయుగాక! ఈ సభ జరుగుచున్న రోజులలో దుఆలు కూడ చేయండి. నమాజుల వైపు కూడ దృష్టి సారించండి. అల్లాహ్ తఆలా తామందరిని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం దుఆలకు వారసులుగా చేయుగాక!

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Incharge Telugu Desk)*

BOOK POST (PRINTED MATTER)

To,

.......................................................................

.......................................................................

.......................................................................